సాక్షి వరంగల్

శుక్రవారం । 28 । మార్చి । 2025

ఉగాది కవితలకు ఆహ్వానం

వసంతాలకు అనాది. శుభాలకు పునాది. తెలుగు సంవత్సరాది.. ఉగాది. కోయిలమ్మ కమ్మని స్వరాల నడుమ, షడ్రుచుల మేళవింపులో కోటి ఆశలకు రెక్కలు తొడుగుతూ వచ్చే వేడుక ఇది. తెలుగుదనం ఉట్టిపడేలా.. సంప్రదాయానికి జీవం పోసేలా సాగే పర్వదినమిది. కొత్త సంవత్సరం ప్రారంభమయ్యే వేళ కవుల భావాలకు 'సాక్షి' అక్షరరూపం ఇస్తోంది. మరింకెందుకాలస్యం.. కలాలు కదిలించండి.. ఉగాదిపై కవితలు రాయండి.

మీరు కవితలు పంపాల్సిన వాట్సాప్ నంబర్ **99483 93391**

చివరి తేదీ : 29-03-2025

నోట్: మీరు పంపే కవిత ఎనిమిది నుంచి తొమ్మిది లైన్లకు మించకుండా ఉండాలి. కవిత చివర మీ పేరు, చిరునామా పేర్కొనాలి. దీంతోపాటు మీ లేటెస్ట్ పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో కూడా పంపాలి. వచ్చిన కవితల్లో బెస్ట్‌గా ఉండేవాటిని ఎంపిక చేసి ప్రచురిస్తాం.



నేడు కమిషనర్‌తో ఫోన్ ఇన్



వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలో 'సాక్షి' ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న **తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, కుక్కలు, కోతుల బెడద** తదితర సమస్యలపై ఫోన్ చేసి కమిషనర్ సుధీర్‌కుమార్‌తో మాట్లాడవచ్చు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

తేది : 28-03-2025, శుక్రవారం
ఫోన్ చేయాల్సిన నంబర్లు:
83749 83453
సమయం : మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు



సర్వే పూర్తి.. ఇక భూసేకరణే

మామునూరు విమానాశ్రయానికి 253 ఎకరాల గుర్తింపు

- నోటిఫికేషన్ జారీ చేసేందుకు అధికారుల కసరత్తు
- ఎకరానికి ప్రభుత్వం చెల్లించే ధరపై నిర్వాసితుల దృష్టి

సాక్షి, వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం భూసర్వేను అధికారులు పూర్తిచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి భూసేకరణే ఇప్పుడు పెద్ద టాస్క్‌గా మారే అవకాశం ఉంది. కొద్ది రోజులుగా రెవెన్యూ విభాగం సర్వే చేసింది. 253 ఎకరాల్లో క్షేత్రస్థాయిలో హద్దులు నిర్ణయించి సేకరించిన వివరాలను కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు నివేదించడంతో ఇక భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసేందుకు అడుగులు పడుతున్నాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఎకరానికి ఎంత ధర చెల్లిస్తారనే అంశం వైపు మళ్లింది. ఇప్పటికే అక్కడ భూములు కోల్పోతున్న రైతులు బహిరంగ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని, లేదంటే భూమికి బదులు భూమి ఇవ్వాలని పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓకు వినతిపత్రాలు సమర్పించిన సంగతి తెలిసిందే. అలాగే, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ కూడా బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. భూసేకరణ కోసం నోటిఫికేషన్ (అవార్డు పాస్ చేయడానికి) ఇచ్చే సమయంలో ధర తేలే అవకాశం ఉంది. ఎకరానికి రూ.20 లక్షలు, ఆపై చెల్లించే అవకాశముందని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

డిసెంబర్‌లోగా కష్టమే..

విమానాశ్రయం కోసం భూములు కోల్పోతున్న గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి, మామునూరు రైతులతో ప్రభుత్వం చర్చలు జరపాలి. సాధ్యమైనంత తొందరగా భూములు ఏఏఐకి అప్పగిస్తే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణ తొలి దశను డిసెంబర్‌లోగా పూర్తిచేసి దేశీయ విమానాల రాకపోకలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నా.. మరింత ఆలస్యం అయ్యే అవకాశం లేకపోలేదు. భూసేకరణ పూర్తయితే 150 నుంచి 186 మంది ప్రయాణించేలా వీలున్న 37.6 మీటర్ల (123 ఫీట్ల) పొడవున్న ఏ-320, బీ-737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటికీ ఆ పాత ఎయిర్‌స్ట్రిప్‌కు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్ ఫోర్స్ అథారిటీ ఆధీనంలో ఉంది. ఈ రన్‌వే విస్తరణ కోసం అదనంగా అవసరమయ్యే 253 ఎకరాల భూమి సేకరిస్తున్న సంగతి తెలిసిందే.



నక్కలపల్లి శివారులో భూములను సర్వే చేస్తున్న ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, రెవెన్యూ అధికారులు (ఫైల్)

మామునూరు ఎయిర్‌పోర్ట్ రన్‌వే



భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల..



ప్రభుత్వ నిర్ణయాన్ని రైతులు అంగీకరిస్తే అంతా మూడు నెలల్లోనే ప్రక్రియ పూర్తిచేసి ఏఏఐకి భూములు అప్పగించనున్నారు. సదరు సంస్థ విమానాశ్రయ నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణకు పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి. మోకా మీద ఒకరు, టైటిల్ మరొకరి పేరు మీద ఉండడం, కోర్టు కేసుల్లో భూమి ఇలా వివిధ కారణాలతో భూసేకరణ పూర్తి కావడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భూసేకరణకు ఎదురయ్యే ఇబ్బందులను వ్యూహాత్మకంగా అధిగమిస్తేనే మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అడుగులు పడే అవకాశం ఉంది.

గుడిసె అంటుకుని పేలిన గ్యాస్ సిలిండర్

దుగ్గొండి: ప్రమాదవశాత్తు గుడిసె అంటుకుని అందులోని గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటన అడవిరంగాపురంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్రి రవి భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో వంట చేయడానికి కట్టెల పొయ్యి అంటుపెట్టి ఆయన బయటికి వెళ్లాడు. కాసేపటికే పొయ్యిలో మంటలు వచ్చి గుడిసె అంటుకుంది. దీంతో భయపడిన రవి కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పుతుండగా గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో గుడిసె పక్కన ఉన్న బుర్రి రాజయ్య ఇంటి బాత్రూం గోడ కూలిపోయింది. సిలిండర్ శకలాలు వంద మీటర్ల దూరంలో రెండు చోట్ల పడ్డాయి. ప్రాణాపాయం తప్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.



సిలిండర్ పేలుడు ధాటికి కూలిన గోడ

వేధించడం సరికాదు

నల్లబెల్లి: ఎండీ గౌసొద్దీన్‌కు చెందిన భూములు కొనుగోలు చేసి మూడు తరాలుగా సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తమను వేధింపులకు గురిచేయడం సరికాదని మేడపల్లికి చెందిన రైతులు తెలిపారు. గౌసొద్దీన్ వారసుడు రఫీయొద్దీన్ ఫిర్యాదుతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ ముప్పు కృష్ణ, నర్సంపేట ల్యాండ్ రికార్డ్స్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రాచారి, జిల్లా గిరిజన అభివృద్ధి సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ గురువారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. గ్రామంలో 185 ఎకరాల భూమిని రైతులు అక్రమంగా పట్టా చేసుకొని సాగు చేసుకుంటున్నారని, వారందరికీ రైతుభరోసా నిలిపివేయాలని రఫీయొద్దీన్ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ వచ్చిన అధికారులను గ్రామంలో అడ్డుకుని రైతులు తమ గోడును వెలిబుచ్చారు. కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న భూముల విలువ పెరగడంతో గౌసొద్దీన్ వారసుడు మాకు వ్యతిరేకంగా అధికారులకు ఫిర్యాదు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి హాజరు కాకుండా ఎలా విచారణ చేస్తారని రైతులు అధికారులను నిలదీశారు. రైతుల నుంచి అధికారులు వినతిపత్రాన్ని తీసుకుని వెళ్లిపోయారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

'నర్చరింగ్'లో మరోసారి చోటు

- మోడల్ పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి
- నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ ఫేజ్-2 లో నగరానికి మరోమారు చోటు దక్కింది. దేశవ్యాప్తంగా 9 నగరాలు ఎంపికవ్వగా అందులో వరంగల్ నగరానికి స్థానం లభించడంపై మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. గురువారం కేంద్ర ప్రభుత్వ డబ్ల్యూఆర్‌ఐ ప్రతినిధులతో మేయర్ సుధారాణి బల్దియా ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. గతంలో నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ ఫేజ్-1లో భాగంగా బల్దియా చక్కటి ప్రతిభను కనబర్చి పార్కుల తీరు తెన్నులను మేయర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. ఫేజ్-2 భాగంగా నగరంలో చేపట్టాల్సిన పనులను డబ్ల్యూఆర్‌ఐ ప్రతినిధులు సూచనలు చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో నియోజకవర్గానికి ఒక మోడల్ పార్కు ఉండాలని పలు మార్పులను సూచించారు. సమావేశంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్ సంతోష్‌బాబు, డీఈ కార్తీక్‌రెడ్డి, ఏఈ రాగి శ్రీకాంత్ డబ్ల్యూఆర్‌ఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న మేయర్ గుండు సుధారాణి

యువకుడి ఆత్మహత్యాయత్నం

- నెక్కొండలో రైలు పట్టాలపై వెళ్తుండగా డయల్ 100కు స్థానికుడి కాల్
- కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు.. కుటుంబ సభ్యులకు అప్పగింత

నెక్కొండ: కుటుంబ కలహాలతో ఓ యువకుడు రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నం చేయగా.. డయల్ 100తో వెంటనే పోలీసులు వచ్చి కాపాడారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కోమటిపల్లి తండాకు చెందిన బానోత్ రమేశ్ ఇంటిలో గొడవపడి గురువారం నెక్కొండ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు నెక్కొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న రైలు పట్టాల మీద నుంచి వెళ్తున్నాడు. ఇది గమనించిన స్థానిక వ్యక్తి డయల్ 100కు కాల్ చేశాడు. దీంతో కానిస్టేబుల్ సాంబయ్య, హోంగార్డు రాజు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైలు పట్టాలపై వెళ్తున్న రమేశ్‌ను వారు కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. రమేశ్ నుంచి వివరాలు తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తల్లిదండ్రులు కమలమ్మ, భీమ, భార్య సునీతకు సమాచారం అందించి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. డయల్ 100తో వెంటనే స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన సాంబయ్య, రాజును ఎస్సై అభినందించారు.



రమేశ్ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై మహేందర్

న్యూస్‌రీల్

ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్‌లో సమావేశం



వరంగల్: ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన గురువారం సమన్వయ సమావేశం జరిగింది. డీసీపీ అంకిత్‌కుమార్‌సక్వార్‌తో కలిసి ఎన్నికల నిర్వహణలో లా అండ్ ఆర్డర్ పై తీసుకోవాల్సిన చర్యల పైన సంబంధిత అధికారులతో చర్చించారు. ఎన్నికల నిర్వహణలో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై డీసీపీ అభిప్రాయాలు తీసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, వరంగల్, వర్ధన్నపేట, నర్సంపేట తహసీల్దార్లు ఇక్బాల్, విజయ్ సాగర్, రాజేశ్, ఎలక్షన్ డీటీ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నర్సంపేట అధ్యక్షుడిగా సంజయ్‌కుమార్



నర్సంపేట రూరల్: బార్ అసోసియేషన్ నర్సంపేట అధ్యక్షుడిగా కొడిదెల సంజయ్‌కుమార్ 9 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు కొమ్ము రమేశ్‌యాదవ్, పుట్టపాక రవి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కొంగరి రాజు ఐదు ఓట్లు, ప్రధాన కార్యదర్శిగా మోటూరి రవి 13 ఓట్లతో తేడాతో గెలుపొందారు. కోశాధికారి దాస్యం రంగనాథస్వామి, సహాయ కార్యదర్శిగా కాంసాని అశోక్, ఈసీ సభ్యులుగా బొడ్డుపల్లి అజయ్, లావుడ్య తిరుమల్‌చౌహాన్, ప్రభాకర్, కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. అనంతరం ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందించారు.

29 నుంచి వరంగల్ మార్కెట్ బంద్

వరంగల్: ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని వరుసగా నాలుగు రోజులు వరంగల్ వ్యవసాయ మార్కెట్ బంద్ ఉంటుందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న (శనివారం) అమావాస్య, యార్డు బంద్, 30న (ఆదివారం) ఉగాది పండుగ, వారాంతపు సెలవు, 31న (సోమవారం) రంజాన్ పండుగ ప్రభుత్వ సెలవు, ఏప్రిల్ 1న(మంగళవారం) రంజాన్ పండుగ ప్రభుత్వ సెలవులు ఉన్నట్లు పేర్కొన్నారు. సెలవు రోజుల్లో మార్కెట్‌లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి పంట ఉత్పత్తులను తీసుకురావొద్దని కోరారు. ఏప్రిల్ 2వ తేదీ బుధవారం మార్కెట్ పునఃప్రారంభమవుతుందని తెలిపారు.

ఎట్టకేలకు నీటి విడుదల

- దేవాదుల మూడో దశ మోటారు ఆన్ చేసిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి
- ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి 600 క్యూసెక్కులు
- దేవన్నపేట పంపుహౌస్‌తో 5,22,522 ఎకరాలకు సాగు నీరు
- వరంగల్, కాజీపేట, హనుమకొండతో పాటు జనగామకు తాగునీరు

హసన్‌పర్తి/ధర్మసాగర్: దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో భాగంగా దేవన్నపేట వద్ద నిర్మించిన పంపుహౌస్ వద్ద ఏర్పాటు చేసిన మూడు మోటార్లలో ఒక మోటారును ఎట్టకేలకు గురువారం సాయంత్రం మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. 600 క్యూసెక్కుల నీటిని ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి వదిలారు.

అరగంటపాటు వెయిటింగ్..

వారం రోజుల క్రితం ధర్మసాగర్ చెరువులోకి నీటిని విడుదల చేయడానికి వచ్చిన మంత్రులు మోటార్లలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా ఆన్ కాకపోవడంతో తిరిగి వెళ్లారు. రెండు రోజుల క్రితం ట్రయల్ రన్ చేస్తున్న క్రమంలో గేట్‌వాల్వ్‌లు పడిపోయాయి. ప్రత్యేక నిపుణులతో వాటికి మరమ్మతులు చేయించారు. రెండోసారి గురువారం సాయంత్రం మోటార్లు ఆన్ చేయడానికి వచ్చినా... మళ్లీ సాంకేతిక సమస్య కారణంగా అరగంట పాటు వెయిట్ చేశారు. టెక్నీషియన్లు సమస్య పరిష్కరించిన తర్వాత మంత్రులు లాంఛనంగా మోటారు ఆన్ చేశారు.

పూజలు.. సన్మానాలు

మొదట దేవన్నపేటకు చేరుకున్న మంత్రులకు కలెక్టర్ ప్రావీణ్య, నాయకులు పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు. వారు తొలుత శిలాఫలకాన్ని సందర్శించారు. అనంతరం పంపుహౌస్ వద్దకు చేరుకోగా, వారికి ఇంజనీర్లు నీటిపంపింగ్ విధానాన్ని కంప్యూటర్‌లో చూపించారు. నీరు ఎక్కడి నుంచి ఎలా వెళ్తుందో వివరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి మూడో దశ ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడినుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే నీరు రిజర్వాయర్‌లోకి వస్తుండగా పసుపు, కుంకుమ, పూలు చల్లి పూజలు చేశారు. నీటిలోకి సారె వదిలారు. ఈ సందర్భంగా మంత్రులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శాలువాలు కప్పి సన్మానించారు. అక్కడే మంత్రులు రెండు నిమిషాలు మాట్లాడి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, యశ్వసినిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాం నర్సింహారెడ్డి, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ అశోక్‌కుమార్, ఎస్ ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సీతారాంనాయక్, డీఈఈ రాజు, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు..



దేవన్నపేట వద్ద నీటి పంపింగ్ విధానాన్ని కంప్యూటర్‌లో చూపిస్తూ మంత్రులకు వివరిస్తున్న ప్రాజెక్టు అధికారులు



మంత్రి ఉత్తమ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడియం, చిత్రంలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు



ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేరుతున్న జలాలు

రెండు భాగాలుగా నీటి పంపిణీ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



దేవాదుల పంపుహౌస్ నుంచి వచ్చే నీటిని రెండు భాగాలుగా పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ధర్మసాగర్ రిజర్వాయర్ కేంద్రంగా ప్రారంభించిన దేవన్నపేట పంపుహౌస్‌తో 5,22,522 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల పరిధిలోని 17,545 ఎకరాలకు ఉత్తర భాగం ప్రధాన కాల్వ ద్వారా, అదేవిధంగా దక్షిణభాగం కాల్వ గుండా స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల పరిధిలోని 1,58,948 ఎకరాలతోపాటు ధర్మసాగర్ తర్వాత బొమ్మకూర్, తపాసుపల్లి, గండిరామారం, అశ్వారావుపల్లి పరిధిలోని 3,46,029 ఎకరాలకు నీరు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట మూడునగరాలతోపాటు జనగామ పట్టణానికి తాగునీరు అందించేందుకు దోహదపడుతుందన్నారు.

రేపు భద్రకాళి ఆలయంలో ఒడిబాల బియ్యం వేలం

హన్మకొండ కల్చరల్: శ్రీభద్రకాళి దేవాలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన 20 క్వింటాళ్ల ఒడిబాల బియ్యాన్ని శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు దేవాలయ ఈఓ శేషుభారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సంగెం: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన బోనాల రఘు గురువారం మొండ్రాయి గ్రామంలోని సోదరి వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. తిమ్మాపూర్ వద్ద బైక్ ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న రఘును గ్రామస్తులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అలుమ్ని స్మారక గోల్డ్ మెడల్ అందజేత

కాజీపేట అర్బన్: నిట్ అలుమ్ని ఆధ్వర్యంలో గురువారం మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ బీటెక్ విద్యార్థిని హర్షిత ఆర్.సజ్జన్‌కు గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. నిట్ వరంగల్ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం దివంగత ప్రొఫెసర్ ఏవీ.రమణరావు స్మారక గోల్డ్ మెడళ్లను అలుమ్ని ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈనూతన ఒరవడికి నాంది పలికిన పూర్వ విద్యార్థులకు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ఆన్‌లైన్‌లో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏవీ.శేషగిరిరావు, రాజు దట్ల, శుక్లా మండోల్ తదితరులు పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న హర్షిత సజ్జన్

ఆర్మీ, నేవీ ఉద్యోగాలకు అనీష్ ఎంపిక

నల్లబెల్లి: ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ ఉద్యోగాలకు మండల కేంద్రానికి చెందిన ఎద్దు నాగ అనీష్ ఎంపికయ్యాడు. ఎద్దు సాంబయ్య-సరోజన దంపతుల కుమారుడు నాగ అనీష్ రక్షణ రంగంలో పనిచేయాలని కలలుగన్నాడు. ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సాంబయ్య కుమారుడిని డిగ్రీ వరకు చదివించి ఉద్యోగాలకు సన్నద్ధం చేశాడు. నేవీ, ఆర్మీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయగా పరీక్షల్లో ప్రతిభ కనబరిచి రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అనీష్‌ను స్థానికులతోపాటు కుటుంబ సభ్యులు అభినందించారు.



తల్లిదండ్రులతో నాగఅనీష్

క్లుప్తంగా

అమ్మవార్ల బంగారం, వెండి తూకం



పూజారుల సమక్షంలో బంగారం, వెండి మిశ్రమాన్ని వేరు చేస్తున్న స్వర్ణకారుడు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మకు భక్తులు మొక్కుగా సమర్పించిన బంగారం, వెండి మిశ్రమాన్ని దేవాదాయశాఖ అధికారులు గురువారం తూకం వేశారు. బుధవారం మినీ జాతర హుండీల కానుకలు లెక్కించిన విషయం తెలిసిందే. 2024లో జరిగిన మహాజాతర తర్వాత భక్తులు సమర్పించిన బంగారం, వెండి మిశ్రమాన్ని అధికారులు సీల్ వేసి హుండీల్లోనే ఉంచారు. మినీ జాతర వరకు వచ్చిన బంగారం, వెండి మిశ్రమాన్ని పూజారుల సమక్షంలో స్వర్ణకారుడితో తూకం వేయించారు. సమ్మక్క హుండీలో బంగారం 42 గ్రాములు, వెండి 3కిలోల 110 గ్రాములు, సారలమ్మ హుండీలో బంగారం 14 గ్రాములు, వెండి 2కిలోల 500 గ్రాములు భక్తులు సమర్పించినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. ఈకార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ కవిత, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారులు మునీందర్, కృష్ణయ్య, చందా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

200 గజాలు.. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ.14.46 కోట్లు



వెబ్ అప్లికేషన్

జనగామ: సాంకేతిక లోపమా.. అధికారుల నిర్లక్ష్యమా తెలియదు కానీ.. 200 గజాల స్థలానికి.. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ.14.46 కోట్లు చూపించారు. దీంతో కస్టమర్ ఖంగుతిన్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ పట్టణానికి చెందిన కారంపూరి శ్రీనివాస్ తనకున్న 200 గజాల స్థలాన్ని లే అవుట్ రెగ్యులరైజేషన్(ఎల్‌ఆర్‌ఎస్) చేసుకునేందుకు 2020 సెప్టెంబర్ 14న రూ.1,000 ఫీజు చెల్లించాడు. కాంగ్రెస్ ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేసుకునేలా అవకాశం కల్పించింది. ఈనెల 26న ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు వెబ్‌సైట్ ఓపెన్ చేయగా.. 14 శాతం ఓపెన్ ప్లేస్, రెగ్యులరైజేషన్, ప్లాట్ మార్కెట్ విలువ కలుపుకుని 25 శాతం రాయితీ అమౌంట్ రూ.90,52,950 మినహాయించి.. మిగతా రూ.14.46 కోట్లు చెల్లించాలని చూపించింది. దీంతో ఒక్కసారిగా టెన్షన్‌కు గురైన శ్రీనివాస్ వెంటనే తనకు తెలిసిన అధికారులకు ఫోన్ చేసి ఈ విషయాన్ని వివరించారు. దీనిపై కలెక్టర్ రిజ్వాన్ బాషాను అడగ్గా రాష్ట్రంలో పలుచోట్ల ఇలాగే వచ్చినట్లు సమాచారం ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కరెక్టు చేసేలా చూస్తామన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

ఈ-స్టోర్.. ఈజీ

ఇ విధానంలో త్వరితగతిన మెటీరియల్ విడుదల

- ఆన్‌లైన్ ద్వారా బుకింగ్.. గంటల్లో పనులు పూర్తి
- టీజీ ఎన్పీడీసీఎల్‌లో సాంకేతికతకు పెద్దపీట
- పేపర్ పట్టుకుని అధికారుల చుట్టు తిరిగే విధానానికి స్వస్తి



టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ : విద్యుత్ శాఖలో ఒకప్పుడు పనులు కావాలంటే కాగితాల ద్వారా జరిగేవి. ఈ విధానం వ్యయప్రయాసాలతో కూడుకున్న అంశం. ఎందుకంటే ఒక అధికారి నుంచి మరో అధికారికి, అతడి నుంచి ఉన్నతాధికారికి ఇలా.. రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టేది. ఫలితంగా పనులు ఆలస్యంగా జరిగేవి. దీంతో అధికారులతోపాటు వినియోగదారులు ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ మండలి సాంకేతిక వినియోగానికి పెద్దపీట వేస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న టెక్నాలజీని కంపెనీ అందిపుచ్చుకుంటూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందిస్తోంది. ఇందులో భాగంగా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఈ-స్టోర్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇంతకు ముందు కాగితాల(పేపర్) ద్వారా పనులు జరిగేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పనులు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ విధానంలో ఒకే రోజు అది కూడా గంటల్లో పనులు జరిగిపోతాయి. ఈ విధానంలోనే ఎన్పీడీసీఎల్‌లో మెటీరియల్ విడుదలకు ఈ-స్టోర్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

పేపర్ విధానంలో మెటీరియల్ విడుదల తీవ్ర కాలయాపన..

ప్రతీ ఉమ్మడి జిల్లా స్థాయిలో విద్యుత్ మెటీరియల్ స్టోర్ ఉంది. ఉమ్మడి జిల్లాలో ఏ అభివృద్ధి పనులు జరిగినా ఇక్కడి నుంచి మెటీరియల్ తీసుకెళ్లాలి. అయితే మెటీరియల్ విడుదలకు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న సెక్షన్ ఏఈ అవసరమైన ఇండెంట్ పెడుతారు. ఇది ఇక్కడి నుంచి ఏడీఈకి వెళ్తుంది. ఏడీఈ అనుమతితో స్టోర్‌కు చేరుకుంటుంది. అప్పుడు మెటీరియల్ విడుదలవుతుంది. పేపర్ విధానంలో ఇన్ని స్టేజీలు దాటాలంటే ఎంత సమయం పడుతుందో అంచనా వేయొచ్చు. పేపర్ ద్వారా మెటీరియల్ విడుదలలో ఆలస్యం జరుగుతుండడంతో ఎన్పీడీసీఎల్ సీఎండీ ఈ -స్టోర్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.

ఈ-స్టోర్‌తో సమయానికి మెటీరియల్ చేతికి..

ఈ-స్టోర్ విధానంలో సంబంధిత సెక్షన్ ఏఈ మొదట ఒక పనికి కావాల్సిన మెటీరియల్స్ స్టాక్ ఉందో లేదో సాప్ (ఎస్.ఎ.పి) సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్‌లో చూసుకుని రిజర్వ్ చేసుకుంటారు. రిజర్వ్ చేసుకున్న మెటీరియల్స్ తాలూకు సమాచారం ఎస్.ఎ.పి వర్క్ ఫ్లో ద్వారా సంబంధిత ఏడీఈకి, తర్వాత స్టోర్స్‌కి వర్క్ ఫ్లో ద్వారా ఆన్‌లైన్‌లో వెళ్తుంది. మెటీరియల్స్ స్వీకరించే అధికారికి, ఏ రోజు మెటీరియల్స్ విడుదల చేస్తారో.. ఆ తేదీని, సమయాని ఎస్ఎంఎస్, ఎస్.ఎ.పి మెయిల్ రూపంలో సమాచారం చేరవేస్తారు. దీంతో నిర్దిష్ట సమయానికి స్టోర్‌కు చేరుకుని మెటీరియల్ తీసుకెళ్తారు. తద్వారా క్షేత్ర స్థాయి అధికారులు పేపర్ పట్టుకుని ఉన్నతాధికారుల చుట్టూ, స్టోర్ చుట్టూ తిరగాల్సిన అవసరముండదు. సమయం ఆదా అవుతుంది. ఈ సమయాన్ని ఇతర పనులకు వెచ్చించొచ్చు. అదే విధంగా వ్యయప్రయాసాలు తగ్గుతాయి. ఈ -స్టోర్ విధానంలో పేపర్ ప్రస్తావన ఉండదు. మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుంది. సమయానికి మెటీరియల్ చేతికి రావడం ద్వారా పనులు వేగంగా జరుగుతాయి. మెటీరియల్ కోసం ఎదురుచూపులు తగ్గుతాయి.

ఈ-స్టోర్‌తో త్వరితగతిన మెటీరియల్ విడుదల



ఈ-స్టోర్ విధానంతో త్వరితగతిన మెటీరియల్ విడుదలవుతోంది. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌కు ముందు సెక్షన్ ఏఈ పేపర్‌పై అవసరమైన మెటీరియల్ జాబితా తయారు చేసుకుని ఏడీఈ వద్దకు వెళ్లి అనుమతి తీసుకుని స్టోర్‌లో అందించేవారు. ఇది వ్యయప్రయాసాలతో కూడుకున్న అంశం. ఈ-స్టోర్‌తో అంతా ఆన్‌లైన్ ద్వారా పనులు జరుగుతున్నాయి.

-పి.మధుసూదన్ రావు, ఎస్ఈ, హనుమకొండ

సకాలంలో పనులు పూర్తవుతున్నాయి



ఈ-స్టోర్ అమలుతో సకాలంలో పనులు పూర్తవుతున్నాయి. కాలయాపన లేదు. పేపర్ ద్వారా జరుగుతున్న జాప్యాన్ని నివారించడానికి టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఈ -స్టోర్ విధానాన్ని తీసుకొచ్చారు. దీంతో విద్యుత్ శాఖ, వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతోంది.

-కె.గౌతం రెడ్డి, ఎస్ఈ, వరంగల్

సారయ్యకు కన్నీటి వీడ్కోలు



సారయ్యకు నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు



విలపిస్తున్న కుటుంబ సభ్యులు





నివాళులర్పిస్తున్న జంగా రాఘవరెడ్డి, అరూరి రమేశ్

- ఎరుపెక్కిన తరాలపల్లి
- ముగిసిన 'అంకేశ్వరపు' అంత్యక్రియలు
- పలువురి సంతాపం

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం తరాలపల్లి ఎర్రజెండాలతో ఎరుపెక్కింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గ్రామానికి చెందిన అంకేశ్వరపు సారయ్యకు కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సారయ్య అలియాస్ సుధాకర్, సుధీర్, ఎల్లన్న మృతి చెందిన విషయం విధితమే. ఈ ఘటనలో కుటుంబ సభ్యులు బుధవారం ఛత్తీస్‌గఢ్ వెళ్లి అక్కడి కాంకేర్ ఆస్పత్రి నుంచి సారయ్య మృతదేహం తీసుకుని గురువారం ఉదయం స్వగ్రామం తరాలపల్లికి చేరుకున్నారు. ఇక్కడ అమరుల బంధు మిత్రుల సంఘం, విరసం నేతలు, పౌర హక్కుల సంఘం నాయకుల సందర్శన అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. సారయ్య చితికి తన సోదరుడు రవీందర్ నిప్పంటించారు. అన్నా ఎక్కడ ఉన్నా బతికి వస్తావనుకున్నా.. కానీ ఇలా నీకు అంత్యక్రియలు చేయాల్సి వస్తుందని అనుకోలేదన్న అంటూ బోరున విలపించాడు. ఇంటి నుంచి శ్మశానం వరకు గ్రామస్తులు, వివిధ సంఘాల నాయకులు విప్లవ గీతాలు ఆలపిస్తూ కన్నీటి వీడ్కోలు పలికారు.

పలువురి పరామర్శ..

సారయ్య మృతదేహానికి తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, వినయ్‌భాస్కర్, కాంగ్రెస్ నాయకుడు నమిండ్ల శ్రీనివాస్, ఉద్యమ నాయకుడు గాదె ఇన్నయ్య, మావోయిస్టు నేత ఏసోబు కుమారుడు మహేశ్ తదితరులు నివాళులర్పించారు.

రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- ముగిసిన రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తుల మేళా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఖిలా వరంగల్: రైతులు శాస్త్రసాంకేతిక పద్ధతులు వినియోగించి అధిక రాబడి పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ నక్కలపల్లి సమీపంలోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ అధ్యక్షతన మూడురోజులుగా నిర్వహించిన రైతు ఉత్పత్తుల మేళా గురువారం సాయంత్రం ముగిసింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు మంచి విత్తనాలు, తగినంత విద్యుత్ సరఫరా పొందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇలాంటి రైతు ఉత్పత్తుల మేళాలు రైతుల్లో కొత్త అధ్యాయానికి బాటలు వేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని, వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణలో నూతన అధ్యాయాన్ని జోడిస్తాయన్నారు. మండలాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు మేళాలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 40కి పైగా ఎఫ్‌పీఓలు, వ్యవసాయ అనుబంధ శాఖలు 10కిపైగా వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు. రైతులు ఈ స్టాళ్లను ఆసక్తిగా తిలకించి అవసరమైన పరికరాలను కొనుగోలు చేశారు. అనంతరం ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసిన 40 స్టాళ్లలో ప్రతిభ కనబరిచిన స్టాల్ నిర్వాహకులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. అలాగే, కలెక్టర్‌ను వ్యవసాయ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అధికారి (డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్) రమన్‌సింగ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జగన్మోహన్‌రావు, నాబార్డ్ ఏజీఎం రవి, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న, ఇన్‌చార్జ్ ఏడీఏ యాకయ్య, ఏఓ రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆదివాసీల కోసం అసువులు బాసిన రాము

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ఉద్యమ సహచరుడిని గుర్తుచేసుకుని కన్నీరు పెట్టుకున్న మంత్రి
- మోకాళ్లపల్లిలో రాము వర్ధంతి సభ



రాము స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క



సభా వేదికపై కన్నీరు పెట్టుకుంటున్న సీతక్క

కొత్తగూడ: ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం గెరిల్లా పోరాట పంథాను ఎంచుకున్న ఉద్యమ సహచరుడు, తన భర్త కుంజ రాము అసువులు బాసాడని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాము స్వగ్రామం మండలంలోని మోకాళ్లపల్లిలో నిర్వహించిన ఆయన 20వ వర్ధంతి సభలో మంత్రి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ సమాజం విద్య, వైద్యం, అభివృద్ధికి దూరం అవుతున్నారని, వాటిని గెరిల్లా ఉద్యమాల ద్వారా సాధించుకోవాలనే లక్ష్యంతో ఆదివాసీ లిబరేషన్ టైగర్ స్థాపించి ఆదివాసీలను చైతన్యం చేస్తూ అజ్ఞాత జీవితం గడిపిన రాము స్మరించుకోవడం ప్రతీ ఆదివాసీ బిడ్డ కర్తవ్యమన్నారు. ఆయన ఆశయాలు నెరవేరాలంటే కలిసి ఉద్యమాలు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి తమ వంతుగా ఏజెన్సీ గ్రామాలను అభివృద్ధి వైపునకు నడిపిస్తానని హామీ ఇచ్చారు.

కన్నీరు పెట్టుకున్న మంత్రి..

అజ్ఞాత ఉద్యమంలో సహచరుడు, తన భర్త కుంజ రాము వర్ధంతి సభలో స్మృతులను తలచుకుని మంత్రి సీతక్క కన్నీరు పెట్టుకున్నారు. సీతక్కను అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క ఓదార్చారు. అనంతరం రాము స్మారక స్తూపం వద్ద నివాళులర్పించి, రాము జీవితంపై రచించిన పాటల సీడీలను ఆవిష్కరించారు.

ఆదివాసీల అభ్యున్నతికి బాటలు వేద్దాం : కుంజ సూర్య

ఆదివాసీల విద్య, ఉద్యోగం కోసం తన సంపాదనలో 20 శాతం కేటాయిస్తానని మంత్రి తనయుడు కుంజ సూర్య ప్రకటించారు. తన తండ్రి ఆశయాలు నెరవేరాలంటే ఉన్నత ఉద్యోగాల్లో ఆదివాసీలు రావాలని అభిప్రాయపడ్డారు. అందుకు కావాల్సిన కోచింగ్‌తో పాటు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రత్యేక సంస్థను నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఈసభకు కుంజ శ్రీను అధ్యక్షత వహించగా తుడుందెబ్బ నాయకులు రమణాల లక్ష్మయ్య, వట్టం ఉపేందర్, ఆగబోయిన రవి, పోడెం బాబు, రచయిత యోచన, నాయకులు స్వామి, యాకయ్య, ముంజాల భిక్షపతి, మాజీ దళ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రూ. 12.80 లక్షల విలువైన గుట్కా పట్టివేత

- ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన కంటైనర్, ఆటో చూపుతున్న పోలీసులు

ఖిలా వరంగల్: అక్రమంగా తరలిస్తున్న రూ.12.80 లక్షల విలువైన 50 బస్తాల పాన్ మసాలా (గుట్కా) ప్యాకెట్లు పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేసిన ఆటో, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. వరంగల్ ఉర్సు గుట్ట వద్ద కంటైనర్ నుంచి ఆటోలోకి 25 బస్తాలు విమల్ కంపెనీకి చెందిన పాన్ మసాలా ప్యాకెట్లు ఎగుమతి అవుతున్నాయని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు సమాచారం అందింది. దీతో ఏసీపీ ఆదేశాల మేరకు గురువారం ఉదయం వరంగల్ ఉర్సు గుట్ట వద్ద టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో కంటైనర్‌తోపాటుఆటోలో తనిఖీ చేయగా.. ఎలాంటి అనుమతులు లేని 50 బస్తాల పాన్ మసాలా ప్యాకెట్లు కనిపించగా పట్టుకున్నారు. కర్ణాటక తుంకూర్‌లోని శివ ఎంటర్‌ప్రైజెస్ నుంచి తెలంగాణలోని హుజూర్‌నగర్‌కు చెందిన తవక్కల్ ట్రేడర్స్ పేరుతో బస్తా పాన్ మసాలాకు వేబిల్లు చూపుతూ.. మిగతా 49 బస్తాలకు అనుమతి లేకుండా వరంగల్ ఉర్సు గుట్ట వద్ద ఆటోలోకి 25 బస్తాలు ఎగుమతి చేస్తుండగా పట్టుకున్నారు. అనంతరం కర్ణాటక గుల్బర్గా మొఘచింవోలికి చెందిన బీమ్‌రెడ్డి, ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు విద్యానగర్ కాలనీకి చెందిన గోపాల మధు, వరంగల్ కాశిబుగ్గ శాంతినగర్ చెందిన ఎండి. జమీల్ హైమద్ అదుపులోకి తీసుకుని తదిపరి విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు కేసును అప్పగించినట్లు టాస్క్‌ఫోర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మిల్స్ కాలనీ పోలీసులు పాల్గొన్నారు.

పనికోసం వచ్చి ప్రాణం కోల్పోయాడు..

అస్వస్థతతో వలస కూలీ మృతి

- డోర్నకల్‌లో ఘటన



వలస కూలీ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

డోర్నకల్ : డోర్నకల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వలస కూలీ అస్వస్థతకు గురై ప్రాణం కోల్పోయాడు. ఆదిలాబాద్ జిల్లా దుబ్బగూడెం ప్రాంతానికి చెందిన కొంతమంది కూలీలు వారం క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గూడూరుపాడు ప్రాంతంలో మిర్చి ఏరేందుకు వచ్చారు. దుబ్బగూడెం ప్రాంతానికే చెందిన మడ్డె సుపరి (30), బీంబాయి దంపతులు తమ ఏడాదిన్నర పాపతో గూడూరుపాడు సమీపంలో ఉన్న తమ బంధువుల వద్దకు రావడానికి గురువారం ఆదిలాబాద్ నుంచి డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత సుపరి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో టికెట్ బుకింగ్ కార్యాలయం సమీపంలో కూర్చున్న చోటే ప్రాణం కోల్పోయాడు. మృతదేహం పక్కన అతడి భార్య బీంబాయి తన చంటిపాపతో గుండెలవిసేలా రోదించడం స్థానికులను కలిచివేసింది. గూడూరుపాడు నుంచి బంధువులతో పాటు రైతులు వచ్చి మృతదేహాన్ని ప్రైవేట్ వాహనంలో సొంత గ్రామానికి తరలించారు.

WANTED
Wanted JEE / NEET / EAPCET - Lecturers, Incharges / Wardens Male / Female in Following Subjects
• SANSKRIT - 2 • ENGLISH - 2 • MATHS - 4 • PHYSICS - 3
• CHEMISTRY - 2 • BOTNAY - 2 • ZOOLOGY - 2 • COMMERCE - 1
• ECONOMICS - 1 • CIVICS - 1 • COMPUTER OPERATORS
• Incharges - 3 (Male), 3 (Female) • Wardens - 6 (Male), 6 (Female)
Date of Interview : 28th March 2025, (Today) Timings : 10 AM to 5 PM
PLACE OF INTERVIEW AND DEMO
KALOJI JUNIOR COLLEGE
Chinthagattu Camp Back Side, Hanamkonda
Contact: 9989139100, 9502133661

మొక్కజొన్న చేను వద్దకు వెళ్తూ మృత్యుఒడికి..

- బైక్‌ను ఢీకొన్న కంటైనర్
- యువకుడి మృతి..గవిచర్లలో ఘటన



చందు(ఫైల్)

సంగెం: మొక్కజొన్న చేను చూసి రావడానికి వెళ్తున్న ఓ యువకుడు మృత్యుఒడికి చేరాడు. ఓ కంటైనర్ అతివేగం, అజాగ్రత్తగా వస్తూ ఎదురుగా బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ యువకుడు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గవిచర్లలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కళావతి, గాలి కుమారస్వామిని 20 ఏళ్లక్రితం వివాహం చేసుకుంది. ఈ దంపతులకు కుమారుడు చందు(18) ఉన్నాడు. 10 ఏళ్ల క్రితం కుమారస్వామి మృతి చెందగా కళావతి అదే గ్రామానికి చెందిన దుడ్డు రవిని రెండో వివాహం చేసుకుంది. అతను కూడా మృతి చెందాడు. అప్పటి నుంచి కళావతి.. కుమారుడు చందుతో కలిసి జీవిస్తోంది. చందు ఇంటర్మీడియట్ చదువుతూనే తల్లికి వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం బైక్‌పై మొక్కజొన్న చేను వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఓ కంటైనర్ అతివేగం, అజాగ్రత్తగా వస్తూ ఎదురుగా బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో చందుకు తీవ్ర గాయాలుకావడంతో వెంటనే ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి కళావతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు. కాగా, చేతికి అందొస్తున్నావు.. ఇక నా కష్టాలు త్వరలోనే తీరుతాయని అనుకుంటే ఇలా అర్ధాంతరంగా చనిపోయావా బిడ్డా అంటూ చందు మృతదేహాన్ని చూసి తల్లి గుండెలవిసేలా రోదించించింది. ఇక తాను ఎవరికోసం బతకాలంటూ బోరున విలపించింది.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న లారీ..

- యువకుడి దుర్మరణం



హరీశ్(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఇసుక లారీ అతివేగం, అజాగ్రత్తగా వస్తూ వాటర్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా ఇరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఛాగల్లు శివారులో జాతీయ రహదారిపై జరిగింది. సీఐ వేణు కథనం ప్రకారం.. మండలంలోని రాఘవాపూర్‌కు చెందిన హరీశ్(28) రోజూ రాఘవాపూర్ నుంచి ఛాగల్లు వరకు వాటర్ ట్యాంకర్‌తో జాతీయ రహదారిపై డివైడర్‌పై ఉన్న మొక్కలను నీరు పోస్తుంటాడు. గురువారం కూడా పోస్తున్నాడు. ఈ క్రమంలో జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న లారీ.. ట్యాంకర్ వెనుక నుంచి నీరు పడుతున్న హరీశ్‌తోపాటు ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హరీశ్ లారీ, ట్యాంకర్ మధ్య ఇరుక్కుని దుర్మరణం చెందాడు. ట్యాంకర్ డ్రైవర్ బెజ్జం రమేశ్, లారీ డ్రైవర్ సిద్ధగోని స్వామికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీసీపీ రాజమహేంద్రనాయక్, సీఐ వేణు, ఎస్సై వినయ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని హరీశ్ మృతదేహాన్ని స్థానికుల సహకారంతో బయటకు తీశారు. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, మూడు నెలల వయసున్న కుమార్తె ఉంది.

ఏకశిల స్కూల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఐనవోలు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పున్నేలు క్రాస్ ఏకశిల స్కూల్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తిని పెద్ద వాహనం ఢీకొన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు. మృతుడు సిమెంట్ రంగు ప్యాంట్, లేత నీలిరంగు, మెరూన్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 8712685244, 8712685030 నంబర్లలో(ఐనవోలు పోలీస్ స్టేషన్) సంప్రదించాలని ఎస్సై పేర్కొన్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి బలి..

లిఫ్ట్ నుంచి పడి వ్యక్తి దుర్మరణం

- హైదరాబాద్‌లో మండల వాసి మృతి



భాస్కర్ (ఫైల్)

లింగాలఘణపురం : మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన వడగం భాస్కర్ (45) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లి అక్కడ ఓ కంపెనీలో పని చేస్తూ దుర్మరణం చెందాడు. గ్రామంలో ఉపాధి లేక సుమారు పదిహేనేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. జగద్గిరిగుట్టలోని ఓ పైపుల కంపెనీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం రోజువారీగా పనికి వెళ్లిన భాస్కర్.. లిఫ్ట్‌లో ఏర్పడిన లోపంతో ఒక్కసారిగా పైనుంచి కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. భాస్కర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, భాస్కర్ పదో తరగతి స్నేహితులు (1994–1995 బ్యాచ్) ఆ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మబ్బు మల్లేశం, జహింగాచారి, సురేశ్, రమేశ్, రాజు, శ్రీనివాస్, శ్రీధర్, భాస్కర్, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

వాగ్దేవి కళాశాల డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు



ఫలితాలు విడుదల చేస్తున్న కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాజేందర్

హన్మకొండ: వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో మొత్తం ఉత్తీర్ణత 56.65 శాతం ఉందన్నారు. కోర్సుల వారీగా ఫలితాలు చూస్తే... బీబీఏలో 63.80 శాతం, బీకాంలో 60.57 శాతం, బీఎస్సీలో 51.87 శాతం, బీసీఏలో 57,27 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, బోధన సిబ్బందికి అభినందనలు తెలిపారు. స్వయంప్రతిపత్తి విద్యా రంగం విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఎంతో సహాయపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డా.ఎ.శేషాచలం మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల కృషిని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుడు, కార్యదర్శి డాక్టర్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాహినీ దేవి, ప్రొఫెసర్ బెనర్జీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరీందర్ రెడ్డి, ప్రొఫెసర్ రాజిరెడ్డి, కంట్రోలర్ సి.దత్తాత్రేయులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

FINANCE
■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1265067]

లేడీస్ హాస్టల్ అమ్మబడును
■ భీమారం బస్టాప్ దగ్గరలో కరీంనగర్ మెయిన్ రోడ్‌లో గల 30 విద్యార్థినుల సెపరేట్ రూములతో రన్నింగ్‌లో ఉన్న గర్ల్స్ హాస్టల్ వెంటనే అమ్మబడును. సంప్ర။ 9705864281 [WA-6570]

BUSINESS OFFER
■ శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్. 9010190666. [SCA25002404]

WANTED
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషంట్లను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18k ఫోన్. 9640400073, 9160900024. [SCA25002324]

■ కాజీపేటలో కారు డ్రైవర్ కావలెను. జీతం + పెట్రోల్ + టిఫిను + లంచ్ ఇవ్వబడును. ఆసక్తిగలవారు కాల్ చెయ్యండి. ఫోన్ : 9963478557. [WB-48283]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పేరెంటింగ్

**ఐఏఎస్ అధికారిణి, ఇద్దరు పిల్లల తల్లి అయిన దివ్య మిట్టల్ ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేసింది.
'నేను ఒక ఐఏఎస్ అధికారిణి ని.
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీలో,
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) బెంగళూరులో చదివాను.
వీటిని సాధించడానికి చాలా కష్టపడ్డాను.
కానీ, నా ఇద్దరు చిన్నారి కూతుళ్లను పెంచే క్రమంలో
సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదీ నన్ను సిద్ధం చేయలేదు..'
అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది.
ఇటీవల కాలంలో ఉద్యోగం చేసే అమ్మల శాతం పెరుగుతోంది.
అదే సమయంలో పిల్లల పెంపకం పట్ల సరైన జాగ్రత్తలు
తీసుకుంటున్నామా అనే ఆందోళనా పెరుగుతోంది.
కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను
నేటి తల్లులు ఎలా సమతుల్యతను సాధించాలో నిపుణులు సూచిస్తున్నారు.**



ఆఫీసులో అమ్మ... ఇంట్లో బిడ్డ

వయస్సుతో సంబంధం లేకుండా కష్టాల్లో ఉన్నప్పుడు మనం 'అమ్మా' అని పిలుస్తాం.

ఈ పిలుపు తల్లీ బిడ్డ జీవితాంతం పంచుకునే అనుబంధానికి స్పష్టమైన సూచన. ప్రాచీన కాలం నుండి సమాజంలో మహిళలు పిల్లల సంరక్షకులుగా పరిగణించబడ్డారు. వారి విధి ఇంటికి, ఇంట్లోని వారిని జాగ్రత్తగా చూసుకోవడానికి మాత్రమే పరిమితమయ్యింది. దీంతో తల్లులు ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలనే ఈ భావన పిల్లలను వారి జీవితాల్లో, అభివృద్ధిలో సురక్షితంగా ఉంచింది. నేడు సమాజంలో తల్లులు ఇంటి పనుల నిర్వహణలోనూ, పిల్లల సంరక్షణలోనూ రెండు పాత్రలను పోషిస్తున్నారు. పిల్లల సంరక్షణలో తండ్రుల వాటా పెరిగినప్పటికీ మహిళలు ఇప్పటికీ వారి ఇంట్లో మొదటి సంరక్షకులుగా ఉంటున్నారు.

విజయవంతమైన మార్పు

ప్రపంచవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్ గురించి చేసిన అధ్యయనాల్లో దాదాపు 73 శాతం మంది మహిళలు 30 ఏళ్ల వయసులో తమ పిల్లలను చూసుకోవడానికి తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని, 27 శాతం మంది కొంతకాలం తర్వాత తిరిగి వచ్చారని గమనించారు. వారిలో దాదాపు 16 శాతం మంది తమ వృత్తిపరమైన పని జీవితంలో అధికారులుగా ఉన్నారు. కాబట్టి తల్లులుగా ఉన్న మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా మార్చుకుంటున్నారని కూడా స్పష్టమైంది. 'ఉద్యోగినిగా డబ్బు సంపాదిస్తూ పిల్లలకు కావల్సినవి సమకూర్చ గలుగుతున్నాను. కానీ, వారిని సక్రమంగా పెంచ గలుగుతున్నానా..' అనుకునే తల్లులకు సాంకేతికత వరంగా మారింది. సమయానుకూలంగా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎంచుకోవచ్చు.

సానుకూల ప్రభావాలు

- ఉద్యోగ తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో రెండు పని చక్రాలతో తమ జీవితాలు సజావుగా నడుస్తున్నట్టు చూస్తారు. ఉన్నత విద్యను పొందగల సామర్థ్యం, భౌతిక, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగల సామర్థ్యం కారణంగా వారు మరింత సంతృప్తికరమైన జీవితాలను గడుపుతారు. ఇప్పుడు ఉద్యోగాల్లోకి వెళ్లే మహిళలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కెరీర్ అవకాశాలను సరైన ప్యాకేజీలతో అందుకుంటున్నారు.
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ అధ్యయనం ప్రకారం పనిచేసే తల్లుల కుమార్తెలు వారి తల్లులకంటే 23శాతం ఎక్కువ సంపాదిస్తారని తెలిసింది. మరోవైపు పనిచేసే తల్లుల కుమారులు బాధ్యతాయుతమైన పెద్దలుగా ఎదుగుతారు. వారి ఆఫీసుల్లో లింగ సమానత్వాన్ని ఇష్టపడతారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను గౌరవిస్తారు. వారు భవిష్యత్తులో తమ కుమార్తెలకు అద్భుతమైన తండ్రులుగా కూడా పెరుగుతారు.
- తమ తల్లి జీవితంలోని దుఃఖకరమైన రోజులనూ చూసి ఉంటారు. అంతేకాదు తమ తల్లి పట్టుదల, దృఢ సంకల్పం వారు మానసికంగా, ఆర్థికంగా తమ సామర్థ్యాల మేరకు తమను తాము ముందుకు తీసుకెళ్లేలా చేస్తాయి. అన్నింటికంటే వారు హీరోలలో తమ తల్లిని ఒక షీ-రో గా చూస్తారు.

హద్దులు అవసరం

పని, కుటుంబంతో పాటు వ్యక్తిగత అవసరాలకూ ప్రాముఖ్యం ఇవ్వండి. శారీరక, భావోద్వేగ శ్రేయస్సు కోసం స్వీయ సంరక్షణ అవసరం అనేది గుర్తుంచుకోవాలి. రోజులో పిల్లలకోసమే అన్నట్టుగా కొంత సమయం గడపండి. ఆ సమయంలో ఏదైనా పని నైపుణ్యాలు నేర్పించాలా, చదువు పట్ల దృష్టి పెట్టాలా, ఆనందంగా ఉంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలా.. ఇలా దేనికది బేరీజు వేసుకోవాలి. సహాయకులుగా ఉండేవారి మద్దతు ఎలా అందుతుందో చెక్ చేసుకోండి. వృత్తిపరమైన వృద్ధికి, తల్లి పాత్రకు విలువనిచ్చేవారిని సహాయకులుగా ఉండేలా చూసుకోండి. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి. ప్రతి ఒక్కరూ పనులు చేసేలా, బాధ్యత తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి.

– ప్రొ. పి.జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ నిపుణులు



మెరుగైన సమయ నిర్వహణ

- పనిచేసే తల్లులు ప్రతిరోజూ తమ పిల్లలతో కనీసం ఒకటి లేదా రెండు గంటలు గడపగలిగేలా సమయాన్ని ప్లాన్‌చేసుకోవాలి. ఇది ఒక దినచర్యగా అనుసరించాలి. వేర్వేరు పనులను షెడ్యూల్ చేయడం, వాటిని సమయానికి పూర్తి చేయడం అనే మీ అలవాటు మీ పిల్లలు అదే అడుగు జాడల్లో నడవడానికి ఒక ఉదాహరణగా ఉపయోగపడుతుంది.
- పిల్లలు టైమ్‌టేబుల్‌కు కట్టుబడి ఉండటానికి కూడా ప్రోత్సహిస్తుంది. పిల్లలు మీ పనిని పూర్తి చేయడంలో సహకరిస్తున్నందుకు మీకు సంతోషాన్ని కలిగిస్తుంది.
- కాలక్రమంలో పిల్లల సమయ నిర్వహణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఇది వారి మెరుగైన జీవితానికి సహాయపడుతుంది. అంతేకాదు, పిల్లలతో మరింత నాణ్యమైన సమయాన్ని గడపడానికి సహాయపడుతుంది.



దివ్య మిట్టల్

అమ్మా, నువ్వే నా హీరో..


నా పెద్ద కూతురికి 8 ఏళ్లు. ప్రపంచం గురించి ఇప్పటికే భిన్నమైన ఆలోచనలను చేస్తుంటుంది. ఎదిగే క్రమంలో ఆమె ఆలోచనల కాంతిని మసకబారనివ్వం. కొన్నిసార్లు పని ఒత్తిడిలో చాలా అలసిపోయినట్టుగా ఉంటుంది. ఆ అలసటలో ఏడుపు వచ్చేస్తుంటుంది కూడా. అలాంటప్పుడు నా కూతురు నన్ను కౌగిలించుకుని, 'నువ్వు నా హీరోవి' అని చెబుతుంది. అంటే, పిల్లలు మనల్ని గమనిస్తారు. వారు మన వైఫల్యాల నుండి దృఢంగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. పడిపోవడం సహజమే అని ఆమెకు చూపించండి, ఆపై లేవండి. నా ఉద్యోగం నాకు ఇది నేర్పింది. ఏది జరిగినా నువ్వు స్థిరంగా ఉంటావని చూపించండి. మాతృత్వంలో తమకు తాము వేసుకునే ప్రశ్నల్లో కొంత అపరాధ భావనతో నిండి ఉంటాయి. నేను పిల్లలకు సరైనదే ఇస్తున్నానా, ఏమైనా తప్పులు చేస్తే.. ఇలాంటివి తలెత్తుతుంటాయి. కానీ, తెలుసుకోవాల్సింది ఏంటంటే మీరు మీ సొంత మార్గంలో ప్రయాణిస్తూ ఆమె దేనినైనా వెంబడించగల ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని గుర్తించాలి. తనను తాను క్షమించుకుంటూ ముందుకు సాగడం కూడా చాలా ముఖ్యం. మీకు ఒకరి కంటే పిల్లలు ఎక్కువమంది ఉంటే ఆ బాధ్యత పది రెట్లు పెరుగుతూనే ఉంటుంది. అందుకని, పిల్లలను ప్రేమించడం కంటే కూడా న్యాయంగా ఉండడటం ముఖ్యం.

– దివ్యా మిట్టల్

రోజువారీ జీవన విధానంలో ముఖ్యమైన వాటికి సమయం ఇస్తూ, తమ పనిని బ్యాలెన్స్ చేసుకుంటూ, చేస్తున్న పని గురించి పిల్లలకు క్లారిటీ ఇవ్వడం వల్ల మెరుగైన ప్రయోజనాలను పొందుతారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యుక్త వయసు



**తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతుంటారు.
పిల్లలు చదువులతో కష్టపడాలి వాస్తవంగా.
కాని వారికి సోషల్ మీడియాలోని
చెత్తా చెదారం, తప్పడు సమాచారం,
ఉద్రిక్త ఆకర్షణలు, హింసాత్మక భావజాలాలు...
ఇవి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.
ఇటీవల వచ్చిన 'అడోలసెన్స్' వెబ్‌సిరీస్
మీద సర్వత్రా చర్చ జరుగుతున్నది.
ఇది హెచ్చరిక అంటున్నారు.
ఈ సిరీస్ మనల్ని ఎలా నిద్ర లేపుతున్నది?**

డిజిటల్ లోయల్లో టీనేజ్ పిల్లలు

మీ పిల్లలు మీతో ఇంట్లో మాట్లాడే భాష మీకు తెలుసు. వాళ్లు సోషల్ మీడియాలో మాట్లాడే భాష మీకు తెలుసా? వాళ్లు ఉపయోగించే 'ఎమోజీ'ల అర్థాలు తెలుసా? మాటలు లేకుండా ఎమోజీలతో గాయపరిచే వీలు ఉంటుందని తెలుసా? కిడ్నీ బీన్స్, రెడ్ పిల్, బ్లూ పిల్, డైనమైట్, రెడ్ హార్ట్, పర్పుల్ హార్ట్, ఎల్లో హార్ట్.... ఈ ఎమోజీల అర్థం ప్రతి దానికీ మారుతుంది. అవి ఎందుకు ఉపయోగిస్తున్నారు. ఇంట్లో మన ఎదురుగా పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసు. సోషల్ మీడియాలో ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసా?

ముఖ్యంగా వారి వయసు 12- 14 సంవత్సరాల మధ్య ఉంటే వారికి తెలిసింది ఎంత... తెలియంది ఎంత... తెలిసీ తెలియంది అంత.

జాగ్రత్త సుమా... అని హెచ్చరించడానికి వచ్చింది 'అడోలసెన్స్' అనే వెబ్ సిరీస్.

నాలుగు ఎపిసోడ్స్‌ల సిరీస్

'అడోలసెన్స్' అనేది నాలుగు ఎపిసోడ్ల మినీ వెబ్ సిరీస్. బ్రిటిష్ క్రైమ్ డ్రామా. బ్రిటన్‌లో టీనేజీ పిల్లల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తిని గమనించి ఈ సిరీస్‌ను తీశారు. జాక్ థోర్న్ స్క్రిప్ట్ రాస్తే, ఫిలిప్ బరాన్‌టిని దర్శకత్వం వహించాడు. ఒక్కో ఎపిసోడ్ ఒక గంట ఉంటుంది. విశేషం ఏమిటంటే ప్రతి ఎపిసోడ్ సింగిల్ షాట్. అంటే మధ్యలో కట్ లేకుండా కెమెరా కదులుతూ దృశ్యాలను చూపుతూ వెళుతుంది. ఈ మేకింగ్‌లో వినూత్నత వల్ల కూడా ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది.

ఎవరు నిందితులు?

సోషల్ మీడియాను, ఎమోజీలను కనిపెట్టిన వారా? వాటిని ఫోన్లకు అనుసంధానం చేసిన వారా? పిల్లలకు ఫోన్లు కొనిచ్చిన తల్లిదండ్రులా? వాళ్లు ఏ మీడియాను ఉపయోగిస్తున్నారో చూడని తల్లిదండ్రుల నిర్బాధ్యతా? వారితో గడపలేని బిజీతో ఉన్న తల్లిదండ్రుల నిర్లక్ష్యమా? సరిగా పెంచని, సరిగా విద్యాబుద్ధులు చెప్పని వారంతా ఇందుకు బాధ్యులు కాదా? సమాజంలో పేరుకున్న హింసా ప్రవృత్తిని దూరం చేయలేని పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, పౌర వ్యవస్థలో ఉన్న వీరంతా కాదా బాధ్యులు.

ఆ పసివాడి సంఘర్షణ

ఈ సిరీస్ మొదలు కావడమే 'జెమీ మిల్లర్' అనే 13 ఏళ్ల పిల్లవాడి అరెస్టుతో మొదలవుతుంది. ముందు రోజు రాత్రి స్కూల్లో తన క్లాస్‌మేట్ అమ్మాయి కేటీని కత్తితో ఏడుసార్లు పొడిచి చంపాడని అభియోగం. తండ్రి, తల్లి, సోదరి హడలిపోతాడు. జెమీ మిల్లర్ అయితే పోలీసులను చూసి ప్యాంట్ తడుపుకుంటాడు. ఆ తర్వాత జెమీనే కేటీని చంపాడని ఇందుకు ఒక స్నేహితుడు కూడా పురిగొల్పాడని విచారణలో ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. అయితే ఇందులో ఎవరి తప్పు ఎంత? దీనికి బాధ్యులు ఎవరెవరు? శిక్ష మాత్రం ఒక్కడికే పడబోతోందా?

ఇన్‌స్టా గొడవ

జెమీ వయసు 13 ఏళ్లే అయినా అతనికి ఇన్‌స్టా అకౌంట్ ఉంది. అందమైన ఫిమేల్‌మోడల్స్ బొమ్మలను అప్పుడప్పుడు షేర్ చేస్తుంటాడు. అతని పోస్టులకు కేటీ కామెంట్స్ పెడుతూ ఉంటుంది. వాటికి రకరకాల ఎమోజీలు వాడుతుంటుంది. అవి జెమీని బాధ పెట్టాయని మనకు తెలుస్తుంది. జెమీ తన వయసులో అపరిపక్వత వల్ల తను ఆకర్షణీయంగా లేడని తనను ఎవరూ ఇష్టపడరని న్యూనతతో ఉంటాడు. కేటీ కామెంట్స్ ఇందుకు ఆజ్యం పోస్తాయి. అంతే కాదు సాటి మనిషి పట్ల, ఆడపిల్లల పట్ల సెన్సిటివ్‌గా ఉండాలనే భావజాలం కాకుండా వాళ్లను ఏమైనా అనొచ్చు ఎలాగైనా ఉండొచ్చు అనే ఆధిపత్య భావజాలమే ఎక్కువగా జెమీకి పరిచయం అవుతుంటుంది. వీటన్నింటి దరిమిలా అతడు కేటీ ప్రాణం తీసేవరకూ వెళతాడు.

టీనేజ్ పిల్లలు ఎంతో సున్నితమైన దశలో ఉండే సీతాకోక చిలుకలు. వారిని గురించి అందరికీ బాధ్యత ఉండాలని చెబుతోంది ఈ సిరీస్. ఇందులోని ముఖ్య పాత్రను ఒవెన్ కూపర్ అనే బాల నటుడు అద్భుతంగా పోషించాడు. దిన పత్రికల వార్తలు కూడా మనకు రోజూ టీనేజ్ పిల్లల సమస్యలు, కుటుంబాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లోపం పట్టి ఇస్తున్నాయి. తల్లిదండ్రులు ఈ సిరీస్ చూడటం మంచిదంటున్నారు అభిరుచి ఉన్న ప్రేక్షకులు. కొందరైతే టీనేజ్ పిల్లలతో పాటుగా తల్లిదండ్రులూ చూడాలని సూచిస్తునారు. ముందు పెద్దలు చూడండి. ఆ తర్వాత మీకు సబబని అనిపిస్తే పిల్లలకు చూపించండి. కానీ ఆలోచించండి.

బ్యూటీ

నిర్లక్ష్యమే అసలైన సమస్య

అందంగా ఉండటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనేది అందరూ అంగీకరించాల్సిందే. యవ్వనంగా కనిపించాలనే తాపత్రయంతోనే జీవనం నాణ్యంగా గడపడానికీ ప్రయత్నించాలి. అందుకు బ్యూటీ చికిత్సలకు ఎక్కువ ఖర్చు పెట్టనవసరం లేదు. నేటి రోజుల్లో కాలుష్యం, సమతుల ఆహార లోపం, స్ట్రెస్ .. వీటన్నింటి ప్రభావం చర్మంపై పడుతుంది. అందుకని సమస్య ఎక్కడ ఉన్నదో దానిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

చాలా మంది ఎదుర్కొనేవి...

యవ్వనంలో ఉన్నవాళ్లైతే యాక్నె, మంగు మచ్చలు, కాస్మొటిక్స్ వాడకం వల్ల ఏర్పడే మచ్చల సమస్య ఉంటుంది. వీటికి ఇంట్లోనే సొంత చికిత్సలు తీసుకోవడం వల్ల మరికొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు.. మొటిమలకు వెల్లుల్లి, టూత్‌పేస్ట్ వంటివి వాడుతుంటారు. మంగు మచ్చలకు తమకు తామే స్టెరాయిడ్స్ వాడుతుంటారు. ఇక శిరోజాల విషయంలో అయితే ఐరనింగ్, స్ట్రెయిటనింగ్, స్టయిలింగ్.. వంటి హెయిర్‌స్టైల్స్ ఎక్కువైపోయాయి. వీటివల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. జుట్టు ఊడిపోవడం పెరుగుతుంది.



బట్టల వల్ల అలెర్జీ

టైట్‌గా ఉండే బట్టలు వేసుకుంటుంటారు. ఫ్యాబ్రిక్ వల్ల దురద సమస్యలు వస్తుంటాయి. అవి, నిర్లక్ష్యం చేస్తే కుటుంబంలో మిగతా వారికీ ఆ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుంది. పులిపిర్లు ప్రైవేట్ పార్ట్స్‌లో వస్తుంటాయి. వాటినీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్మొటిక్ ప్రయోగాలు అయితే చెప్పలేం. అవి తమ చర్మానికి సరిపడతాయో లేదో కూడా చూడరు. దీని వల్ల చర్మం రంగు మారుతుంది.

ఫేషియల్స్

ఫేషియల్స్ చేయించుకుంటుంటారు. ఫ్రూట్ ఫేషియల్స్ సాధారణ కాంతికి పనిచేస్తాయి. హైడ్రా ఫేషియల్, డెర్మాఫేషియల్స్, కెమికల్ పీల్.. వంటి ఫేషియల్స్ నిపుణుల పర్యవేక్షణలోనే చేయించుకోవాలి. హెయిర్‌కి, స్కిన్‌కి పీఆర్‌పీ చేయించుకుంటారు. ఇవి చేయించుకున్నంత మాత్రాన అంతా బాగుపోదు. సరైన మెయింటెనెన్స్ అవసరం.

చెయిన్లతో మెడపై నలుపు

ఆడవాళ్లలో చాలా వరకు మెడపైన నల్లగా అవుతుంది. ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, శుభ్రత పాటించకపోవడం, అధికబరువు వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అండర్ ఆర్మ్స్ డార్క్‌గా ఉన్నప్పుడు నిపుణుల సూచనలు తీసుకోవాలి. అధికబరువుకు లైపోసక్షన్ వంటివి చికిత్సలు తీసుకుంటారు. బరువు తగ్గినప్పుడు ఎలాంటి ఫిట్‌నెస్ సూచనలు పాటించాలో కూడా నిపుణుల సూచనలు తీసుకోవాలి.

స్ట్రెచ్ మార్క్స్

మహిళలకు ప్రసవం తర్వాత స్ట్రెచ్ మార్క్స్ పెద్ద సమస్య. ప్రసవం తర్వాత మూడవ నెల వరకు క్రీములు వాడుతూ ఉండాలి. అన్ని డెలివరీలు పూర్తయ్యాక స్ట్రెచ్ మార్క్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మరో సమస్య పాదాల పగుళ్లు. క్రీమ్ వాడితే దాని మీద దుమ్ము పేరుకుంటుంది. అందుకని, రాత్రి పడుకునేముందు పాదాలను శుభ్రం చేసి, క్రీమ్ రాసి, సాక్సులు ధరించాలి.

డిటర్జెంట్స్ వల్ల ఎగ్జిమా!

చేతులకు ఎగ్జిమా వస్తుంది. డిటర్జెంట్స్ వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అందుకని ఇంటి క్లీనింగ్‌లో చేతులకు గ్లౌజ్స్ మోచేతుల వరకు ఉండేవి మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించాలి.

పర్మనెంట్స్ చేయించుకుంటున్నారా..!

బ్యూటీ చికిత్సలలో పర్మనెంట్ మెథడ్స్‌కి ఇటీవల డిమాండ్ పెరిగింది. వాటిలో బొటాక్స్, ఫిల్లర్స్, స్కిన్ బూస్టర్స్, లిప్ కరెక్షన్, స్కిన్ టైటెనింగ్, గ్లోయింగ్ కోసం తీసుకునే ఇంజక్షన్స్.. ఈ కాస్మొటిక్స్ చికిత్సలన్నీ వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. రెగ్యులర్ మేకప్ చేసుకునేవారు కాస్మొటిక్స్ తమ చర్మతత్వానికి సరిపడేవి ఎంచుకోవాలి. తిరిగి శుభ్రం చేసుకోవడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.



– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్

ఫ్యాషన్

**పచ్చని తోరణాలు.. షడ్రుచుల ఆస్వాదన.. సంప్రదాయ వస్త్రధారణ
ఉగాదికి స్వాగతం పలుకుతూ
కొత్త ఉత్సాహాన్ని మదికి మోసుకువస్తాయి.
చేనేత చీరలు, ఎంబ్రాయిడరీ సొగసులు వాటి రంగుల హంగులు
ప్రకృతి పరవశించేలా పండగకు మరింత శోభను తీసుకువస్తాయి.
ముఖ్యంగా పసుపు, ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు రంగులు
పండగ కళను రెట్టింపుగా మన కళ్లకు కడతాయి.**

ప్రకృతి పరవశం



చేనేత కళ

పండగ నాడు కళను రెట్టింపు చేసే అలంకరణకు ప్రాముఖ్యత ఇస్తుంటారు. అయితే, అందుకు పెద్ద హడావిడి లేకుండా మనవైన చేనేతలలో కాంతిమంతమైన రంగులున్న చీరలను ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో కంచిపట్టు చీరల నుంచి కలనేత వరకు అన్నీ పండగను వెలిగించేవే.

సహజమైన రంగులు

ప్రకృతి నేపథ్యంగా ఉగాది జరుపుకుంటారు కాబట్టి పసుపు, ఆకుపచ్చ, నారింజ, ఎరుపు రంగుల కాటన్, తెలుపు, ఎరుపు కాంబినేషన్, పింక్ కలర్ టస్సర్, సిల్క్ చీరలు ప్రత్యేక ఆకర్షణతో ఆకట్టుకుంటాయి.

డిజైన్లు

చెక్స్, లైన్స్‌తో ఉన్న డిజైన్లు, మెరుపులు లేకుండా థ్రెడ్ ఎంబ్రాయిడరీ వర్క్, సహజంగా అనిపించే పెయింటింగ్స్ ఈ పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

ఇతర అలంకరణలు..

- చీరలకు లాంగ్ స్లీవ్స్ బ్లౌజులు, టెంపుల్ జ్యువెలరీ లేదా థ్రెడ్, టెర్రకోట జ్యువెలరీ బాగుంటాయి.
- పసుపు, ఎరుపు కాంబినేషన్ ప్లెయిన్ గాజులు, సహజంగా అనిపించేలా తక్కువ మేకప్ ప్రత్యేకతను చూపుతుంది.
- శిరోజాల అలంకరణలో జడ, కొప్పులు, పువ్వులకు ప్రాధాన్యమిస్తే పండగ ప్రకృతి కళతో ఆకట్టుకుంటుంది.



